

# అభాగిని లలిత

— రాచకొండ విశ్వనాథశాస్త్రి

''కృష్ణారావూ! విశ్వాసరావు భార్య లలిత సముద్రంలో పడి ఆత్మహత్య చేసుకుందట విన్నావా?'' అన్నాను నేను సిగరెట్టు పీలుస్తూ వాలు కుర్చీలో కూర్చున్న నా స్నేహితుడితో. కాని వాని ముఖంలో ఏ మాత్రమూ ఆశ్చర్య చిహ్నాలు కనబడలేదు.

''ఇస్, ఇల్లా జరుగుతుందని నేను మొట్ట మొదటినుంచీ అనుకున్నా''నన్నాడు.

నా కాశ్చర్యం వేసింది. ''ఏ కారణం వల్ల అనుకున్నావు? నీ కామె గురించి కొంత తెలిసి నట్లుంది. నాకు చెప్పు.''


కృష్ణారావు కొంతసేపాలోచించి ఇలా చెప్పాడు:

''లలితని దాదాపు పాతిక సంవత్సరాల నుంచి నేను ఎరుగుదు. అప్పు డామెకి పదిహేను సంవత్సరాలు. నిండు యవ్వనంలో వుంది. గొప్పవారింటి బిడ్డ. ఏ విధంగానూ ఆమెకు లోపం లేదు. అప్పటికప్పు డే తల్లిదండ్రులు పెళ్ళి గురించి ప్రయత్నాలు చేస్తున్నారు. ఆ సమయంలో కొన్ని సంఘటనలు జరిగాయి. మధుసూదనుడనే స్నేహితుడు నాకొకడు వుండేవాడు. వాని గురించి తలచుకుంటే నా కళ్ళు చెమ్మగిల్లుతాయి. అదొక విధమైన విచారం నన్ను క్రమింగేస్తూ వుంటుంది. వానిని మరచిపోదామని చూస్తాను. కాని మరపునకు రాడు. పుట్టడం బీద కుటుంబంలో పుట్టేడు. కాని గుణాల్లో హరిశ్చంద్రుడంతటివాడు. ఎన్నో కష్టాలు గట్టెక్కి బి.ఎ. వరకు వచ్చేడు. ఒకనాడు లలితను ఏదో సందర్భంలో కలుసుకున్నాడు. చూచీచూడడంతో వాని మనస్సు ఆమె యందు లగ్నమయింది. ఆమె కూడా వీనిని ప్రేమించింది. ఆమె తల్లిదండ్రులకి తెలియకుండా యిద్దరూ అనేక పర్యాయాలు రహస్యంగా కలుసుకున్నారు. కాని ఈ రహస్యం ఎన్నాళ్ళు దాగుతుంది? అందులోను లోకులు లలితా మధుసూదనుల గురించి అనేక విధాలుగా చెప్పుకోసాగేరు. అది ఆనోటా ఆనోటా లలిత తల్లిదండ్రుల చెవిని పడ్డది. తండ్రి ఆగ్రహంతో కొట్టేడని కూడా విన్నాను. తల్లిదింకా సాధు స్వభావం. కుమార్తెని పిలిచి నచ్చచెప్పింది తొందరపాటుతో ఏ పనీ చెయ్యవద్దని. మధుసూదనుడు బీదవాడు. భార్యని ఎలాగ పోషించగలడు? ఆమె కోరికలేమీ తీర్చలేడు. ధనం లేనిదే ఏ విధంగా సౌఖ్యపెట్టగలడు? లలితకు బోధనలన్నీ బాగా నాటేయి. అవును; నిజమే. మధుసూదనుడు తనను ఏ విధంగా పోషించగలడు? వానిని ప్రేమిస్తే ప్రేమించింది. కాని పెళ్ళాడి తిండి లేక చావగలదా?

కొద్దిరోజుల్లోనే ఈ విశ్వాసరావుకిచ్చి వివాహం చేయడం స్థిరపడ్డది. మధుసూదనకీ బోగట్టా తెలిసింది. తన చెవులని తనే నమ్మలేకపోయాడు. లలిత తననింత అన్యాయం చేస్తుందా అనుకున్నాడు. ఆమెని ఒకనాటి సాయంకాలం

కలుసుకుని విశ్వాసరావును పెళ్ళి చేసుకోవడం నిజమేనా అని ప్రశ్నించాడు. లలిత సమాధానం చెప్పలేదు. అవునని మెల్లగా సంజ్ఞ చేసింది. దానితో మధుసూదనుని ఆకాశ హర్మ్యాలన్నీ నేలమట్టమయిపోయేయి. ఆ సాయంకాలం అస్తమిస్తున్న సూర్యుడిలాగే వాని ఆశలన్నీ అస్తమించాయి.

లలితా విశ్వాసరావుల వివాహం జరిగిపోయింది. అప్పటినుంచే మధుసూదనుడు పాడైపోయేడు. వానిలో వున్న ఉత్సాహమంతా అడుగంటిపోయింది. దిక్కులేని పక్షిలాగా ఊరల్లా తిరిగేవాడు. చదవడం మానివేయడం వల్ల బి.ఎ. ప్యాసు కాలేకపోయాడు. అటు తర్వాత క్రమంగా మంచం పట్టేడు. లేవడానికి శక్తి లేదు. రోజూ జ్వరం తగుల్తూంది. చేతిలో పైసా లేదు. రెండు రోజులు త్రాగడానికి మంచి నీరిచ్చేవారు లేక పడివున్నాడంటే నమ్ము- ఈ విషయం తెలిసి ప్రతి దినం వెళ్ళి నేను ఉపచారాలు చేసేవాడిని. డాక్టర్ని తీసుకువచ్చి చూపించేను. ఏమీ లాభం లేదని పెదవి విరిచి వెళ్ళిపోయాడు. ఇటువంటి స్థితిలో వున్నా ఇతర స్నేహితులలో ఒకరైనా రాలేదు. కొందరు తినడానికి లేని వాడికి




ప్రేమ ఏమిటని పరిహాసం చేసేరు. కొందరు నటన అన్నారు. లోకంలో బీదవాడవడంతోటే ఎన్ని కష్టాలైనా పడాలి. ఎందరి పాదాలైనా పట్టుకోవాలి. ఎందరి చేతనైనా తిట్లు తినాలి. బీదవాణ్ణి ప్రతీవాడు నీచంగా చూస్తాడు. వారిని మనుష్యుల కింద పరిగణించరు.

మామూలు ప్రకారం ఒకనాడు సాయంకాలం మధుసూదనుని గదికి వెళ్ళేను. ఆనాడు రోజూకన్న జ్వరం, దగ్గూ, నీరసం హెచ్చుగా వున్నాయి. స్పష్టంగా మాటలాడలేకపోయేడు. ఏదో చేతుల్తో సంజ్ఞ చేసేడు కాని నాకేమీ అర్థమవలేదు. "ఏమైనా కావాలా" అని అడిగేను. "లలిత" అన్న ముక్క అతి ప్రయాసతో నోటినుంచి వెలువడ్డ . వాని భావం గ్రహించేను. వాని జీవిత సమాప్తి సమీపిస్తూంది. లలితని ఒక్క పర్యాయం చూడడం వాని కడసారి కోరిక. అది తీరకపోతే వానినే కాదు, నన్ను ఆజన్మాంతం అది వేధిస్తూ వుంటుంది. వెంటనే లలితని పిలవడానికి వెళ్ళేను. కాని ఆమె ఇంటిలో లేదు. నిరాశతో తిరిగి మధుసూదనుని దగ్గరకు వచ్చాను. ఆ సాయంకాలపు దృశ్యం నేనెన్నటికీ మరువలేను. తలుపు చప్పుడు కాగానే బరువైన కళ్ళు నావైపు త్రిప్పేడు. కాని అవి నావైపు కావు, నా వెనుక ఎవరైనా వున్నారేమో అని ఆతృతతో చూస్తున్నాయి. లేకపోవడం చూచి నిస్పృహతో తిరిగి మూసుకున్నాయి. మంచాన్ని సమీపించి 'లలిత ఇంటిలో లేద'ని చెప్పేను. నా మాటలేవీ వాని చెవిని పడలేదు. కిటికీ ద్వారా వాని ముఖం మీద పడుతున్న సూర్యకిరణాల కాంతి క్రమంగా క్షీణించిపోతూంది. దానితో పాటు నా స్నేహితుని ముఖ కాంతి కూడా మెల్లమెల్లగా అదృశ్యమయిపోయింది."


ఈ రీతిగా చెప్పి కృష్ణారావు వూరకున్నాడు. వాని కళ్ళంట దుఃఖాశ్రువులు రాల్తున్నాయి. కొంతసేపటికి గొంతు సవరించుకొని చెప్పడం ప్రారంభించేడు.

"పోనీ, విశ్వాసరావుని వివాహమాడిన లలిత ఏమైనా సుఖపడదా? విశ్వాసరావు



ధనవంతుడే. కాని ధనంతో సుఖం వస్తుందా? అదే నిజమయినట్లయితే ప్రపంచములో వున్న ధనికులంతా సుఖంగా వున్నారా? లలిత మాటా అంతే; ధనంతో పాటు సౌఖ్యం కూడా వస్తుందనుకుంది. కాని తన ఊహ పొరపాటని త్వరలోనే తెలుసుకోగలిగింది. చదువూ, సంధ్యా లేదు. సుగుణ మన్నది ఏ కోశాన్ని వెదకినా లేదు. లలితని ప్రారంభంనుంచీ ఏవగించుకునేవాడు. ఆమె సౌందర్యం వాని నాకర్షించలేదు. అతడు లలితను వదిలి రామామణి వలలో చిక్కుపడ్డాడు. క్రమంగా మద్యం అలవడ్డది. లలితకి అతనిని చూడడమే అరుదైపోయింది. ఇంటికి వచ్చినప్పుడు ఈ చెడు బుద్ధులు మానమని బోధించేది. దానికి బహుమతి తిట్లు, తన్నులు.

ఈ రీతిగా పది పన్నెండు సంవత్సరాలు గడిచేయి. లలిత కిద్దరు కుమారులు. మోహనుడు, రామారావు. విశ్వాసరావు ఎన్ని అగచాట్లు పెట్టినా వీరిద్దరినీ చూచుకుని కాలం గడుపుతూ వుండేది. కాని భర్త పెట్టే బాధలు తగ్గలేదు సరికదా ప్రతి దినం హెచ్చవుతున్నాయి. వాని చేతిలో పైసా లేదు. ఉన్నదంతా రామామణి చేతిలో కొంత పోసేడు. సారా సీసాల క్రింద కొంత వెదచల్లేడు. ఆస్తినంతా భూములు, ఇళ్ళు మొదలుకుని ఇంటిలో పాత్ర సామగ్రి వరకు అన్నీ అమ్మివేశాడు. ఈ వ్యవహారమంతా చూసి రామామణి గడప త్రొక్కనివ్వలేదు. ఆ క్రోధం మీద భార్య ఏదో అన్నదని ఆమెని, పిల్లల్ని రాత్రి వీధిలోకి తరిమివేశాడు. అప్పుడు నేను సినిమా నుంచి వస్తున్నాను. అది చలి కాలం. అందులోనూ ఆనాడు చలి మరీ



ఈ రేయి వెన్నెల రేని యిక్కలో
కస్తూరి కామోద సుమములే విరిసెహో!

రిక్కగమి వెక్కిళ్ల
నెక్కి నిలిచిన సిగ్గు
రంగు రంగుల మెరిసి
తొంగి చూచెను మురిసి

అరుణ కిరణముల్లి
తరుణ శశికళ కులికే
మధుర సోపాన తతి
మంటి మింటిక నమిరె

వైశాఖ పూర్ణిమ- రాచకొండ విశ్వనాథ శాస్త్రి బాపిరాజుగారికి జరిగిన కనకాభిషేక మహోత్సవాన గానం చేసినది

యెక్కువగా వుంది. మంచు దట్టంగా కురుస్తూంది. లలిత, రామారావు రోడ్డుమీద పడి వున్నారు. ఇద్దరి దేహాలూ ఆ దుర్మార్గుడు కొట్టిన దెబ్బల చేత కాబోలు రక్తాలు కారుతున్నాయి. మోహనరావెక్కడా కనిపించలేదు. వారిని నా నివాసానికి తీసుకుని వచ్చి నా భార్యచేత ఉపచారాలు చేయించేను. ఆ మర్నాడు కూడా మోహనరావు కనిపించలేదు. తండ్రి పెట్టిన బాధలు సహించలేక దేశాల పాలయిపోయేడు.

గోరుచుట్టు మీద రోకటి పోటు లాగు ఈ దెబ్బతో లలిత భూపతితమయిపోయింది. ఇద్దరి కుమారులను చూసుకుని ఆనందించే ఆమెకిక దుఃఖం తప్ప సుఖం ఎక్కడిది? ఈ విషయం ఇలాగుండగా ఒకనాడు విశ్వాసరావు అకస్మాత్తుగా చనిపోయేడు. దానితో లలిత కష్టాలు కొన్ని గట్టెక్కేయనుకున్నాను. కాని నా ఊహ పొరపాటు. ఆమె కష్టాలు ద్విగుణీకృతమయ్యేయి. తినడానికి తిండి లేదు. కట్టడానికి గుడ్డ లేదు. వుండడానికి ఇల్లు లేదు. ఒక కుమారుడు దేశాంతరగతుడైపోయేడు. రెండవ కుమారుని వల్ల సుఖిస్తుందనుకున్నాను. కాని విధి వానిని కూడా ఆమెకు దూరం చేసింది. టైఫాయిడ్ జ్వరం తగిలి, తగిన పరిచర్య లేక మొన్ననే రామారావు తండ్రి త్రోవ పట్టాడు. ఈ దుఃఖం లలిత సహించలేకపోయింది. నిన్నటినుండీ ఆమెనెవరూ చూడలేదు. ఇప్పుడు ఆమె శవం సముద్రంలో తేలింది.''

కృష్ణారావు ఏదో ఆలోచిస్తూ విచారంగా కూర్చున్నాడు. నేను మెల్లగా బయటికి వచ్చాను.

జులై 30 శ్రీ రావిశాస్త్రి జన్మదిన సందర్భంగా శ్రీ చలసాని ప్రసాద్ సేకరించిన 'అభాగిని లలిత' (చిత్రగుప్త-పక్షపత్రిక, 1-12-1938 నుంచి) పునర్ముద్రిస్తున్నాము.

—ఎడిటర్